క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



మందారెడ్డిని అభినందిస్తున్న మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు : నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శిగా సత్తి మందారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సీతమ్మధారలోని నియోజకవర్గ కార్యాలయంలో సమన్వయకర్త మొల్లి అప్పారావుని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మందారెడ్డిని మొల్లి అప్పారావు సత్కరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం పలకాలి

బీచ్ రోడ్డు : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం రామ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో మెడికల్ కాలేజీని సందర్శించడానికి పార్టీ అధినేత జగన్ ఈ నెల 9న ఉదయం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. వార్డు నుంచి కార్యకర్తలు విమానాశ్రయానికి వెళ్లి ఘనంగా స్వాగతం పలకాలని కోరారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



పరిశీలిస్తున్న ముప్పల సురేష్, తదితరులు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డులో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ ఏఈని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముప్పల సురేష్ కోరారు. ఈ మేరకు స్తంభాలు లేని ప్రాంతాలను మంగళవారం ఏఈతో కలిసి ఆయన పరిశీలించారు. ముఖ్యంగా బాల్ భావన్ పార్క్ వాకింగ్ ట్రాక్ వద్ద చీకటిగా ఉంటోందని, అక్కడ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు వెలిగించాలని కోరారు. వారితోపాటు వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళకు సత్వర చికిత్స

మహారాణిపేట: పెదగంట్యాడ సమీపంలోని శ్రీనగర్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బి.రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. గాజువాకలో మార్కెట్ ముగించుకుని స్కూటీపై స్వగ్రామం నరవకు వెళ్తున్న రాజేశ్వరిని లారీ బలంగా ఢీకొట్టడంతో ఆమె కుడి కాలు నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 సేవలకు కాల్ చేయగా, పెదగంట్యాడ నుంచి 108 అంబులెన్స్ సిబ్బంది – ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దూది రమేష్, పైలట్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు రాజేశ్వరికి సత్వర వైద్యాన్ని అందించి, చికిత్స నిమిత్తం కేజీహెచ్ తరలించారు.

సౌకర్యాలు మరిచారు..!

- ఇటీవల ప్రారంభించిన ఆరిలోవ రైతుబజార్‌కు విశేష ఆదరణ
- భారీగా వినియోగదారులు రావడంతో పార్కింగ్‌కు ఇబ్బందులు
- పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాహనదారులకు అవస్థలు
- బజారు మధ్యలో షెల్టర్ లేకపోవడంతో వర్షం కురిస్తే అంతే సంగతులు



గుడ్లు విక్రయిస్తున్న మహిళా వ్యాపారి



రైతుబజార్ వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రహదారిపై నిలిపిన వాహనాలు

ఆరిలోవ :

ఆరిలోవలో ఎట్టకేలకు రైతు బజార్ ప్రారంభించినప్పటికీ సరైన సౌకర్యాలు లేకపోవడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల కళ నెరవేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నప్పటికీ... పార్కింగ్ సదుపాయం, బజారు మధ్యలో షెల్టర్ లేకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇక్కడ రైతు బజార్ నిర్మాణ పనులు ప్రారంభించి సుమారు 70 శాతంపైగా పూర్తి చేసిన విషయం తెలిసిందే. మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి స్థానికురాలు కావడంతో ఆరిలోవ ప్రజల కోసం అత్యంత వేగంగా పనులు జరిపించారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలో మిగిలిన కొద్దిపాటి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. ఇక్కడ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజల నుంచి ఒత్తిడి, విమర్శలు రావడంతోపాటు సాక్షిలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అరకొర సౌకర్యాలతో బజార్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఈ రైతుబజార్‌ను ప్రారంభించారు. అయితే ఇక్కడ కల్పించాల్సిన సౌకర్యాలు మాత్రం లేవు. ఈ నెల 2న ఆరిలోవ రైతు బజార్‌ను స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. అప్పటి నుంచి అందుబాటులో ఉన్న ఈ రైతు బజార్‌కు పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, టి.ఐ.సి.పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, గాంధీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారంతోపాటు హనుమంతవాక, సంజయగ్‌గాంధీ కాలనీ, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాళ్ పురం వరకు కొండవాలు ప్రాంతాల ప్రజలు కాయగూరలు కొనడానికి ఇక్కడకు రోజూ వస్తున్నారు. ఆయా ప్రాంతాల వాసులు ఇప్పటి వరకు దూర ప్రాంతాల్లో ఉన్న ఎంవీపీ, సీతమ్మధార రైతు బజార్లకు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి తప్పింది.

పూర్తికాని రైతుల ఎంపిక, స్టాళ్ల కేటాయింపు

ఆరిలోవ రైతు బజార్‌లో వినియోగదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- ఇక్కడ ఇప్పటికీ శాశ్వతంగా విక్రయాలు జరిపేందుకు రైతులను ఎంపిక చేయలేదు. ఇప్పటికే ఈ రైతు బజార్‌లో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవడానికి 1000 మంది దరఖాస్తు చేసుకున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులే తెలిపారు. అయినా వారిలో ఇంత వరకు శాశ్వత రైతులను ఎంపిక చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. నగరంలోని వేర్వేరు రైతు బజార్లకు చెందిన రైతులతోనే తాత్కాలికంగా విక్రయాలు జరుపుతున్నారు. వారు కూడా అరకొరగా ఉన్నారు.
- ఈ రైతుబజార్‌లో 43 స్టాళ్లు ఉన్నప్పటికీ కాయగూరలు విక్రయించే రైతులు లేక కొన్ని ఖాళీగా ఉన్నాయి.
- ఇక్కడ ఉన్న స్టాళ్లలో ఐదింటిని కిరాణా వ్యాపారాల కోసమని మినహాయించారు. అయితే ఆ స్టాళ్లలో విక్రయాలు జరిపేందుకు కిరాణా వ్యాపారులను నేటికీ కేటాయించలేదు. దీంతో ఇక్కడ కిరాణా సామగ్రి విక్రయాలు జరగడం లేదు.
- ఇక్కడ రైతులు, వ్యాపారులకు స్టాళ్లు తప్ప వినియోగదారుల కోసం నీడ సౌకర్యం లేదు. ఈ బజార్ లోపల ఖాళీ స్థలంలో పైకప్పు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో ఎండ సమయంలో నీడకు, వర్షం కురిస్తే తడవకుండా ఉండేందుకు వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే కొనుగోలుదారులు తడిచిపోతున్నారు.
- బయటకు కనిపించేలా బోర్డు లేకపోవడం మరో సమస్య. ఇక్కడ రైతు బజార్ లోపలకు ఉంది. ప్రధాన రహదారి నుంచి చూస్తే కనిపించదు. రైతు బజార్‌కు వెళ్లే దారిలో ప్రధాన రహదారి వద్ద ప్రత్యేకంగా ఆర్చ్ నిర్మించి అందరికి కనిపించే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రైతులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న స్టాళ్లు

రహదారికి ఇరువైపులా పార్కింగ్



రైతుబజార్ పక్కన చదును చేయకుండా రాళ్లతో వదిలేసిన ఖాళీ స్థలం

ఆరిలోవ రైతుబజార్‌కు వచ్చే వారిని పార్కింగ్ సమస్య ప్రధానంగా వేధిస్తోంది. పెదగదిలి గెడ్డపై వంతెన నుంచి రైతు బజార్ లోపలకు వెళ్లడానికి మట్టితో రహదారి ఏర్పాటు చేశారు. ఇక్కడ పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో ఆ రహదారిపైనే ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలను వినియోగదారులు నిలిపేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. దీని పక్కన కొంత ఖాళీ స్థలం ఉన్నప్పటికీ దాన్ని చదును చేయకుండా రాళ్లు, మట్టితో వదిలేశారు. దీంతో రాళ్ల మధ్య వాహనాలు నిలపడానికి వీలు పడటం లేదు. దీంతో రోడ్డు మీదే వాహనాలు నిలపడంతో రహదారి అస్తవ్యస్తంగా మారుతోంది.



ఆరిలోవ రైతు బజార్‌లో కాయగూరలు కొంటున్న వినియోగదారులు



టమాటా స్టాల్ వద్ద వినియోగదారుల క్యూ

‘చలో నర్సీపట్నం మెడికల్ కాలేజ్’కు తరలిరండి

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు



పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

బీచ్‌రోడ్డు : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు అక్టోబర్ 9న నిర్వహించనున్న చలో నర్సీపట్నం మెడికల్ కాలేజ్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. ఈ మేరకు సీతమ్మధారలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి సుమారు 3 వేల మంది కార్యకర్తలు హాజరయ్యేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో ఉన్న కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులు బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకట స్వాతి దాసు, రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా కార్యదర్శి ఉమ్మిడి దాసు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్న పాత్రుడు, కార్యదర్శి చొక్కర శేఖర్, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆర్గనైజ్ కార్యదర్శి నందూరి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు, ఇంటలెక్చువల్ జోనల్ విభాగం అధ్యక్షుడు నీలాపు కాశిదాసు రెడ్డి, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమ్, పీతల గోవింద్, తూర్పు మహిళ విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, తూర్పు యూత్ విభాగం అధ్యక్షుడు కాగితాల రవికిరణ్ రెడ్డి, చెంబూరి వెంకటరావు, పీతల మహేష్, బేతా దుర్గారావు, బొట్ట శివ, బంగారు భవాని శంకర్, కిముడు భాస్కర్, మక్బూల్, నిజాముద్దీన్, పిలక తరుణ్ రెడ్డి, మొల్లి సింహాద్రి, పీలా జోశిల, పతివాడ వెంకటలక్ష్మి, గుడ్ల గణేష్ రెడ్డి, ఎండ్రెడ్ల ఈశ్వర రెడ్డి, సంపంగి సురేష్, ఇమంది సత్యనారాయణ, పిలక మధుసూదన రెడ్డి, గొలగాని త్రినాథరావు, వానపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాజాలో మారణహోమం ఆపాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పౌర చైతన్య వేదిక సభ్యులు

బీచ్‌రోడ్డు: గాజాలో ఇజ్రాయెల్ రెండేళ్లుగా సృష్టించిన మారణహోమాన్ని, దాడులను తక్షణమే ఆపాలని పౌర చైతన్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వేదిక విశాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.కోలవెన్ను చాంద్ ప్రసంగిస్తూ పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని, యుద్ధ నేరస్తులు నేతన్యాహూ, ట్రంప్‌లను శిక్షించాలని, మోదీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గాజాలో జరిగిన ప్రాణనష్టం మానవత్వమున్న అందరినీ కలిచివేస్తోందన్నారు. అమెరికా అండతో గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న దురాగతాలను ఆయన తీవ్రంగా ఖండించారు. పౌర చైతన్య వేదిక విశాఖ కార్యదర్శి సీహెచ్.ప్రమీల మాట్లాడుతూ గాజా మారణహోమంపై ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు.

ప్రభుత్వరంగ సంస్థ బీఈఎల్, అదానీ కంపెనీలు ఇజ్రాయెల్‌లోని ఎల్బిట్ కంపెనీతో రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుని యుద్ధ టెక్నాలజీని అందించి, పరోక్షంగా యుద్ధానికి తోడ్పడుతున్నాయని ఆరోపించారు.

వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.గోవిందరాజులు మాట్లాడుతూ తక్షణ కాల్పుల విరమణ, పాలస్తీనా రాజ్యానికి గుర్తింపు కోరుతున్న సమయంలో.. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక సామ్రాజ్యవాద ఉద్దేశం, కుట్రను బహిర్గతం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.అభిలాష్, సంతోష్, సృజన్, సామాజిక కార్యకర్తలు రామప్రభు, విజ్ఞానంద తదితరులు పాల్గొన్నారు.

‘ద్వారం’ విగ్రహంపై విరిగిపడిన డోమ్



బీచ్‌రోడ్డులో విగ్రహంపై విరిగిపడిన డోమ్

ఏయూ క్యాంపస్ : సాగర తీరంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. విగ్రహాలను శుభ్రం చేసేవారు, అవసరమైన మరమ్మతులు చేసేవారు కరువయ్యారు. కొన్ని నెలల క్రితం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఇక్కడి విగ్రహాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పలు విగ్రహాలు పక్షుల వ్యర్థాలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. తాజాగా విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న శాంతి వనంలో వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు విగ్రహం పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. విగ్రహంపై ఏర్పాటు చేసిన ఇనుప డోమ్ విరిగిపోయి ఆ విగ్రహంపై పడింది. దీనికి సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప పిల్లర్ తుప్పు పట్టడంతో విరిగిపోయింది. మొత్తంగా అక్కడ ద్వారం వెంకటస్వామి నాయుడు విగ్రహం కనిపించడం లేదు. అధికారులు వెంటనే దృష్టి సారించి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



తోటగరువు హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ చేస్తున్న మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు



శ్రీకృష్ణాపురం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి తోటగరువు హైస్కూల్ పరిసరాల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం అవగాహన కార్యక్రమంలో కౌన్సిలర్లు ఝాన్సీ, రమ మాట్లాడుతూ మంచి మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులు ఆశపడి ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీని కోసం విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మానసిక ఆందోళన, ఒత్తిడిని అధిగమించడానికి యోగా అవసరమన్నారు. యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. దీంతోపాటు రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు, కాయగూరలు, పండ్లు తినాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక అనారోగ్యంపై అలసత్వం వద్దు

మానసిక అనారోగ్యంపై అలసత్వం వహించొద్దని శ్రీకృష్ణాపురం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.మహిత సూచించారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురం హెల్త్ సెంటర్‌లో వాసవి మహిళా మండలి (వీఎంఎం) ఆధ్వర్యంలో మంగళవారం ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ వైద్యాధికారి మాట్లాడుతూ మానసిక అనారోగ్యం పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన లేదన్నారు. దీంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మహిళా మండలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలు మండలాల్లో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రాజెక్టు ప్రతినిధులు మాట్లాడుతూ మహిళల సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రతినిధులు గోపీచంద్, భవానీ, హెల్త్ సెంటర్ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సనాతన ధర్మం పేరుతో మతోన్మాద చర్యలు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బీచ్‌రోడ్డు:

సీజేఐ బీఆర్ గవాయ్‌పై కోర్టు హాల్‌లో మతోన్మాది న్యాయవాది బూటు విసిరి దాడికి పాల్పడటం సనాతన ధర్మం పేరుతో మతోన్మాద చర్యని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సీపీఐ జిల్లా సమితి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ పరివార శక్తులు దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి విభజన తీసుకొస్తూ ఈ సమాజంలో వెదజల్లిన విష సంస్కృతికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి ప్రతీకన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తూ ముందుకెళ్తున్న నేపథ్యంలో సీజేఐపై జరిగిన దాడిని సమర్థిస్తారా.. లేక వ్యతిరేకిస్తారా అని స్పష్టంగా రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మథరావు, నెయ్యల నాగభూషణరావు, ఎం.ఎ.బేగం, కాసుబాబు, పుష్పలత, ఆదినారాయణ, శ్రీనివాస్, రాము, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి మతోన్మాదానికి నిదర్శనం

డాబాగార్డెన్స్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం జగదాంబ జంక్షన్‌లో సీపీఎం నిరసన తెలిపింది. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం మాట్లాడుతూ సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న నెపంతో సీజేఐ గవాయ్‌పైకి మతోన్మాద అడ్వకేట్ కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరడం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు. ఇది రాజ్యాంగంపై దాడి అని, దీనికి పాల్పడిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే చెప్పు విసరడం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానమన్నారు. ఇదే సనాతన ధర్మమని ప్రధాన మంత్రి భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. దీనిపై ప్రధాని జవాబు చెప్పాలన్నారు.

సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కల్యాణ్ దీన్ని బలపరుస్తారా? వ్యతిరేకిస్తారా? చెప్పాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వై.రాజు, ఎం.సుబ్బారావు, రాజు, నాయుడు, జ్యోతీశ్వరరావు, కుమార్ మంగళం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు, స్కూళ్ల పరిశీలన



అగనంపూడి జెడ్పీ హైస్కూల్‌లో ఆహారం పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు, తదితరులు

మహారాణిపేట: జాతీయ ఆహార భద్రత చట్టం–2013 అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు నగరంలో తనిఖీలు నిర్వహించారు. రేషన్ డిపోల్లో స్టాక్ బోర్డు వివరాలు లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో లోపాలు గుర్తించి, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందేలా చూడాలని సూచించారు. అగనంపూడి జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కాంతారావు, పిల్లలకు ఇస్తున్న గుడ్లు బరువు తక్కువగా ఉండటాన్ని గమనించి హెచ్‌ఎంను హెచ్చరించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన కుంచమాంబ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు, గాజువాక ఏఎస్‌ఓ కృష్ణ, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

జీవీఎంసీలో వాల్మీకి జయంతి

డాబాగార్డెన్స్: సంస్కృత సాహిత్యంలో పేరెన్నిక గల మహాకవి వాల్మీకి అని, ఆదికవిగా, మహాజ్ఞానిగా, సంస్కృతంలో రామాయణ మహా కావ్యాన్ని రచించిన మహనీయుడని, మహర్షి వాల్మీకి జీవిత విశేషాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఇతర అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శ్రీరాముని కథను చెప్పే సంస్కృత ఇతిహాసం, రామాయణాన్ని రచించి ఈ ప్రపంచానికి అందించిన మహాకవి వాల్మీకి అని కొనియాడారు.